## బాలకార్మిక విముక్తి ఉద్యమం - నిజామాబాద్ జిల్లా

# పిల్లలు పనిలో కాదు - బడిలో ఉండాలి

నేటి బాలలే రేపటి జాతి నిర్మాతలు. బడిఈడు గల పిల్లలందర్ని బడిలో చేర్చి చదివించడం మనందరి సామాజిక బాధ్యత. సమాజంలోని ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే దేశం ముందడుగు వేస్తుంది. 14 ఏళ్ళలోపు పిల్లలందరూ చదువులు నేర్వాలి. ఆట, పాటలతో చదువుకోవాల్సిన బాలలు ఎందరో చదువుకు నోచుకోక పనుల్లో మగ్గిపోతున్నారు. బాలల కష్టం దేశానికి నష్టం. మన జిల్లాలో బీడీ కార్ఖానాలు, హోటళ్ళు, వైన్‌షాపులు, ఆటోమోబైల్ వర్క్‌షాప్‌లు, సైకిల్ రిపేరింగ్ షాపులు. భవన నిర్మాణ పనులు, రాళ్ళు కొట్టడం, కాగితాలు ఏరుకోవడం, జీతముండడం, పశువుల కాపరులుగా అనేకమంది పిల్లల బాల్యం పనులలో బుగ్గిపాలవుతోంది.

బాలలకు పనినుండి విముక్తి కల్గించి, విద్యావకాశాలు కల్పించుటకై జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. జిల్లా ప్రాథమిక విద్యా పథకము (డిపెప్), బాలకార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో **"బాల్యరక్ష"** కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా నిజామాబాద్, బోధన్, కామారెడ్డి పట్టణాల్లో అమలు చేయడానికి నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలో డిపెప్ ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో వేల్పూర్ మండలం నూరు శాతం నమోదు, నిలకడలను సాధించి రాష్ట్రస్థాయిలో బాలకార్మిక విముక్తి కల్గించిన తొలి మండలంగా గుర్తింపు పొందినది. అలాగే నందిపేట, ఎడపల్లి, రెంజల్ మండలాల్లో బాలకార్మిక విముక్తి కార్యక్రమాలు ఉధృతంగా సాగుతున్నాయి. జిల్లాలోని బీడి పరిశ్రమలలో పనిచేసే బాలికలకోసం బాలకార్మిక ప్రాజెక్టు సొసైటీ ఆధ్వర్యంలో 34 ప్రత్యేక పాఠశాలలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ పాఠశాలల ద్వారా ఇప్పటివరకు 1908 మంది బాల కార్మికులకు విముక్తి కల్గించి రెగ్యులర్ పాఠశాలల్లో చేర్పించడం జరిగింది.

## బాల్యరక్ష ఉద్యమం

★ నిజామాబాద్, బోధన్, కామారెడ్డి పట్టణాలలో స్వచ్ఛంద సంస్థలు, అధికారులు, అనధికారులు, డిపెప్, బాలకార్మిక ప్రాజెక్టు సొసైటీల సమన్వయంతో వివిధ పనుల్లో బడిబయట ఉన్న 14 ఏళ్ళలోపు పిల్లలను పని నుండి విముక్తి కల్గించి వారికి విద్యావకాశాలు కల్పించడం జరుగుతుంది.

★ డిసెంబర్ మాసములో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పై పట్టణాల్లోని వార్డుల్లో బాలకార్మిక విముక్తికై ప్రచార చైతన్య కార్యక్రమాలు, కరపత్రాల పంపిణీ, పోస్టర్లు అంటించడం, మైకుల ద్వారా ప్రచారం, ఇంటింటికీ వెళ్ళి నచ్చజెప్పడం, వార్డులవారీ సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం తదితర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.

★ రెండవ దశలో భాగంగా సర్వే ద్వారా గుర్తించిన బాలకార్మికుల తల్లిదండ్రులకు నచ్చజెప్పడం, పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులకు నోటీసులు జారీ చేయడం, పిల్లలను పని నుండి విడుదల చేసేలా హెచ్చరికలు చేయడం జరుగుతుంది.

★ మూడో దశలో భాగంగా పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులు, షాపులు, కార్ఖానాలు, హోటళ్ళు, వైన్‌షాపులు తదితర ప్రాంతాల్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు బృందాలుగా **"బాల్యరక్ష"** బాలకార్మిక విముక్తి దాడులు నిర్వహించడం, పిల్లల్ని విడుదల చేయడం, విడుదలచేయని యజమానుల అరెస్టు, చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

★ పని నుండి విముక్తి కలిగించిన బాలలను వారి విద్యాస్థాయిని బట్టి పాఠశాలల్లోను, రెసిడెన్షియల్ బ్రిడ్జి క్యాంపుల్లోను చేర్పించి విద్యను కొనసాగించేలా చేయడం జరుగుతుంది.

☞ త్రిప్పిచూడుము.

## బాల కార్మిక విముక్తి - చట్టాలు

★ 14 సంవత్సరాల లోపు పిల్లలచేత పనిచేయించే సంస్థలు, యజమానులు, బాలకార్మికచట్టం 1986, ఆంధ్రప్రదేశ్ దుకాణాలు మరియు సంస్థల చట్టం 1988 క్రింద శిక్షార్హులు.

★ బాలలను జీతగాళ్ళుగా తీసుకుంటే వెట్టిచాకిరీ నిర్మూలనా చట్టం 1986 క్రింద నేరం. ప్రమాదకరమైన వృత్తులలో, సేవారంగాలలోబాలకార్మికులచే పనిచేయిస్తున్న యాజమాన్యాలపై 20వేల జరిమానా విధించడం జరుగుతుంది.

★ వెట్టిచాకిరీ నిమిత్తం పిల్లల తల్లిదండ్రులకిచ్చిన డబ్బు తిరిగి చెల్లించాలని పట్టుబడితే శిక్ష తీవ్రతరం, జరిమానా కూడా.

★ బాలలను ఏరకమైన పనిలోకి తీసుకున్నా వారు కనీసవేతన చట్టం క్రింద నేరస్తులు కావచ్చు.

★ మీరు ప్రభుత్వ ఉద్యోగులైతే ఏ రకమైన పనిలో పెట్టుకున్నా ఏ.పి.సివిల్ సర్వీసెస్ (కాండాక్ట్) రూల్స్ 1964 ప్రకారం కూడా శిక్షార్హులు.

## మీ సహకారం ఎలా అందించాలి

జిల్లాలోని బాలకార్మిక విముక్తికి వినూత్న రీతిలో నిజామాబాద్, బోధన్, కామారెడ్డి పట్టణ ప్రాంతాలలో డిసెంబర్ 20 నుండి నిర్వహిస్తున్న **"బాల్యరక్ష"** ఉద్యమంలో భాగంగా మీరు మీ వార్డుల్లో జరిగే కార్యక్రమాలో తప్పకుండా పాల్గొనండి. 5 నుండి 14 ఏళ్ళలోపు పిల్లలు ఏ పనిలో ఉన్నా తల్లిదండ్రులకు, యజమానులకు నచ్చచెప్పండి. పని నుంచి విముక్తి కల్గించండి. 14 ఏళ్ళలోపు పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి పనినుంచి పిల్లలకు విముక్తి కలిగించేలా సహకరించాలి. అలా విడుదల చేయని వారిపై కేసులు నమోదుచేసి అరెస్టు చేయడం జరుగుతుంది. పిల్లలందరూ పనుల్లోకాకుండా బడుల్లోను, బ్రిడ్జిక్యాంపుల్లోను చేరేలా మీ ఇరుగు పొరుగు వారికి తెలియచెప్పండి. ప్రచారం చేయండి.

మహత్తరమైన **"బాల్యరక్ష"** ఉద్యమంలో స్వచ్ఛంద సంస్థలు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, డ్వాక్వా, సి.డి.ఎస్‌లు, పాఠశాల కమిటీలు, యువత, అధికారులు, అనధికారులు, ఉపాధ్యాయులు, షాపులు, దుకాణాల యజమానులు, ట్రేడ్ యూనియన్లు, కార్మిక సంఘాలు ప్రతి ఒక్కరూ భాగస్వాములై బడి బయట పిల్లలందరినీ పనులు మాన్పించి బాలకార్మిక విముక్తికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందించగలరని ఆకాంక్షిస్తూ...

**పసిమొగ్గలను వికసించనీయండి - కూలీలుగా మార్చకండి**

**బాల కార్మిక వ్యవస్థను నిరోధించండి - బాలలందరిని బడులలో చేర్పించండి.**

మీ

(సంతకం)

**జి. అశోక్ కుమార్** I.A.S.
జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్
జిల్లా ప్రాథమిక విద్యాపథకము (DPEP)
బాల్ల కార్మిక ప్రాజెక్టు సొసైటీ (NCLP)
నిజామాబాద్.